క్లుప్తంగా

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం



కొత్తబోరు వేయిస్తున్న ఎంపీపీ సరిత

శ్రీరంగరాజపురం : మండలంలోని చిన్నతయ్యూరు దళితవాడ ప్రజలకు తాగునీరు అందించేందుకు గురువారం ఎంపీపీ సరిత ఆధ్వర్యంలో బోరు వేశారు. ఎంపీపీ మాట్లాడుతూ చిన్నతయ్యూరు గ్రామానికి తాగునీటి సౌకర్యం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ క్రమంలో మండల గ్రాంటు నుంచి కొత్త బోరు వేయిస్తున్నట్టు తెలిపారు. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. సర్పంచ్ వరదమ్మ, మాజీ సర్పంచ్ బాబు, నాయకులు ఆనంద్, మణి, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు



అక్రమ నిర్మాణాన్ని తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

కార్వేటినగరం: ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుని నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ రవికుమార్ హెచ్చరించారు. మండలంలోని వడ్డి ఇండ్లు గ్రామం వద్ద గురువారం కొందరు రోడ్డుపై చేపట్టిన నిర్మాణాలను తొలగించారు. ఆయన మాట్లాడుతూ వడ్డి ఇండ్లు గ్రామానికి చెందిన వ్యక్తి నాలుగు రోడ్ల కూడలిలో ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలిగేలా అక్రమంగా భవన నిర్మాణం చేపడుతున్నట్లు సమాచారం అందిందన్నారు. ఈ విషయాన్ని జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి నిర్మాణాన్ని తొలగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ రెడ్డెప్ప, వీఆర్వో గోపి, విలేజ్ సర్వేయర్ చరణ్‌తేజ పాల్గొన్నారు.

కారు సహా కర్ణాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న కర్ణాటక మద్యంతో ఎస్ఐ రామాంజనేయులు, సిబ్బంది

గంగాధర నెల్లూరు: మండలంలోని ఠాణా చెక్‌పోస్ట్ వద్ద గురువారం సాయంత్రం కర్ణాటక మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ పెద్దకాల్వ పంచాయతీ ఠాణా చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టామన్నారు. ఠాణా చెక్‌పోస్ట్ గ్రామానికి చెందిన గజేంద్ర కారును వదిలేసి పారిపోయాడని కారులో పరిశీలించగా కర్ణాటక మద్యం 16 కేసులు ఉన్నట్టు గుర్తించామన్నారు. కారు సహా మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. మద్యం విలువ రూ.82 వేలు ఉంటుందని తెలిపారు. ఏఎస్ఐ ఆంజనేయులు రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ గోపి, సిబ్బంది భరత్, సురేష్ పాల్గొన్నారు.

నటుడు విజయ్‌కాంత్‌కు నివాళి



విజయ్‌కాంత్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అభిమానులు

నగరి : తమిళ సినీ నటుడు, డీఎండీకే పార్టీ వ్యవస్థాపకుడు విజయకాంత్ గురువారం మృతి చెందారు. నగరి మున్సిపాలిటీ పరిధిలోని కీళపట్టు దళితవాడలో అభిమానులు కౌన్సిలర్ అణిమ్మయాకోబ్ ఆధ్వర్యంలో విజయకాంత్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం

నగరి : స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ 139వ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం ఆ పార్టీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి బాబు పార్టీ పతాకాన్ని ఎగురవేసి స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఏఐసీసీ సభ్యుడు భానుమూర్తి, పీసీసీ సభ్యుడు నటరాజ మొదలియార్, డీసీసీ సెక్రటరీలు ఢిల్లీ, దేశయ్య, చిరంజీవి రెడ్డి, కేశవులు, నాగేశ్వరావు పాల్గొన్నారు.

పాఠశాలకు రూ.1.3 లక్షల విరాళం



నారాయణవనం: పాలమంగళం ఉన్నత పాఠశాల భవన నిర్మాణానికి స్థానిక మేరువ కుటుంబ సభ్యులు రూ.1.30 లక్షల చెక్కును గురువారం హెచ్ఎం మనోహరికి అందజేశారు. హెచ్ఎం మాట్లాడుతూ పాఠశాలలో మెరుగైన సౌకర్యాలను కల్పించేందుకు మేరువ జయప్రకాశ్, హరి ప్రసాద్, నిరంజన్, దిలీప్, వినోద్, లోహిత, నరసింహులు, లక్ష్మి ఆర్థిక సాయం చేయడం అభినందనీయమని కొనియాడారు.

ఆడేస్తున్నారు.. అందరూ



పాలసముద్రం: ఆముదాలలో ఖోఖో ఆడుతున్న మహిళలు

పుత్తూరు: ఆడుదాం ఆంధ్రా పోటీలు గురువారం కూడా జోరుగా జరిగాయి. స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, గేట్ పుత్తూరులోని తమిళ పాఠశాల గ్రౌండ్‌లోనూ వాలీబాల్, క్రికెట్, కబడ్డీ, కోకో పోటీలు నిర్వహించారు. ఇందులో యువతీయువలకు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన పోటీలను మున్సిపల్ డీఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఏఈఈలు హేమశేఖర్‌రెడ్డి, కార్తికేయన్ పర్యవేక్షించారు.

నగరిలో క్రీడా సందడి

నగరి : గ్రామీణుల్లో దాగి వున్న ప్రతిభను వెలికితీయాలనే ఉద్దేశంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు కొనసాగుతున్నాయి. మూడోరోజైన గురువారం జరిగిన పోటీల్లో యువకులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను కనబర్చారు. క్రీడా పోటీలతో ఊరూరా సందడి వాతావరణం నెలకొంది. మండలంలోని బుగ్గ అగ్రహారం గ్రామంలో ఎంపీడీవో లీలామాధవి, ప్రత్యేక అధికారి వాసు బ్యాడ్మింటన్, వాలీబాల్ పోటీల్లో పాల్గొని క్రీడాకారులను ఉత్సాహపరిచారు. సర్పంచులు రవికుమార్, చంద్రకళ, ఎంపీటీసీ జ్యోతి, మాజీ సర్పంచులు వేలాయుధం, ఛాన్‌బాషా, సచివాలయ కన్వీనర్ హరి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ సత్యరాజ్, పీడీ బాబు, కోఆప్షన్ సభ్యులు దస్తగిరి, నాయకులు హేమాద్రి, మాబూనిషా, మస్తాన్‌బాయ్, అలావుద్దీన్ బాయ్, సెక్రటరీ బాలాజీ పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

విజయపురం (నగరి) : మండల కేంద్రమైన విజయపురం, పన్నూరు ఉన్నత పాఠశాలల ఆవరణలో గురువారం మూడో రోజు ఆడుదాం.. ఆంధ్రా క్రీడా పోటీలు ఉల్లాసంగా ఉత్సాహంగా జరిగాయి. పోటీల్లో విజయపురం, కాళికాపురం, ఇల్లత్తూరు, గంగమాంబపురం, ఎం.అగరం సచివాలయం పరిధిలోని క్రీడాకారులకు బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. హోరాహోరీగా జరిగిన పోటీల్లో గెలుపొందిన టీమ్‌ను ఎంపీడీవో చంద్రమౌళి, ఎంఈవో ఆంజనేయులు అభినందించారు. ఎంపీడీవో మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం కలుగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సురేంద్రకుమార్, బాబు పాల్గొన్నారు.

ఆడుదాం..ఆంధ్రాతో క్రీడాకారులకు ప్రోత్సాహం

పాలసముద్రం : గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకే ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా పోటీలను నిర్వహిస్తోందని ఎంపీడీవో రామనాథరెడ్డి తెలిపారు. ఆయన గురువారం ఆడుదాం ఆంధ్రా పోటీలను పరిశీలించారు. శ్రీకావేరిరాజుపురం గ్రామ సచివాలయం పరిధిలో జరిగిన క్రికెట్ పోటీల్లో మండల స్థాయికి ఎంపికైన యువకులను అభినందించారు. పాలసముదంలో జెడ్పీటీసీ అన్నలగన్, సర్పంచ్ అయ్యప్ప క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఆముదాల ఎంపీటీసీ లిఖిత, సర్పంచ్ అనురేఖ సమక్షంలో మహిళలు ఖోఖో క్రీడా పోటీలు నిర్వహించారు. సర్పంచ్ గాలి మహేష్ బాబు, లిల్లీ, శోభ, జీవిత, నరసింహరాజు పాల్గొన్నారు.

యువతను ప్రోత్సహించడానికే ఆడుదాం ఆంధ్రా పోటీలు

కార్వేటినగరం: యువతను ప్రోత్సహించడానికే ఆడుదాం ఆంధ్రా క్రీడలు నిర్వహిస్తున్నట్టు ఎంపీపీ లత తెలిపారు. మండల కేంద్రమైన కార్వేటినగరంలోని ఆర్కేఎస్సార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గురువారం వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లో ఉన్న నైపుణ్యాన్ని వెలికితీయడమే ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. అందులో భాగంగానే 45 రోజులు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారని తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి వాలీబాల్ ఆడి పోటీలను ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, సర్పంచ్ ధనుంజయవర్మ, ఈవో పీఎస్ మణి పాల్గొన్నారు.

యువతలో క్రీడా ప్రతిభను వెలికి తీయడానికే పోటీలు

పెనుమూరు (కార్వేటినగరం) : గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం.. ఆంధ్రా క్రీడా పోటీలను ప్రారంభించారని వడ్డెర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మనోహర్ తెలిపారు. పెనుమూరు మండలంలోని గంగుపల్లి సచివాలయం వద్ద గురువారం సర్పంచ్ బాలాజీ ఆధ్వర్యంలో పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్ద పీట వేసిందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ రవి, ప్రత్యేక అధికారి సుబ్రమణ్యం, డీడీవో శేషుకుమార్, నాగభూషణమ్మ, ప్రభుకిరణ్ పాల్గొన్నారు.

మంచి ఆరోగ్యానికి క్రీడలు ఎంతో అవసరం

శ్రీరంగరాజపురం : మంచి ఆరోగ్యానికి క్రీడలు ఎంతో అవసరమని ఎంపీడీవో కృష్ణయ్య, సర్పంచ్ హరిత తెలిపారు. శ్రీరంగరాజపురం సచివాలయం పరిధిలో గురువారం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని యువతలో దాగివున్న ప్రతిభను వెలికితీయడానికి ప్రభుత్వం ఆడుదాం..ఆంధ్రా క్రీడా పోటీలకు శ్రీకారం చుట్టిందన్నారు. మండల ప్రత్యేక అధికారి సబర్మతి, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుప్పయ్య, తహసీల్దార్ బెన్నురాజు, ఎంపీడీవో ఏఈ శ్రీధర్, డీటీ లోకనాథపిళ్లై, మాజీ జెడ్పీటీసీ గురవారెడ్డి, జనార్ధన్, మణి, కుప్పయ్య, భాస్కర్‌రెడ్డి, అమృతరాజ్ తదితరులు పాల్గొన్నారు.





పుత్తూరులో క్రికెట్ పోటీలకు టాస్ వేస్తున్న అంపైర్, మహిళల వాలీబాల్ పోటీలు, నగరి : బుగ్గ అగ్రహారంలో బ్యాడ్మింటన్ ఆడుతున్న ఎంపీడీవో, ప్రత్యేక అధికారి





నగరి : వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు, క్రికెట్ ఆటకు టాస్ వేస్తున్న నిర్వాహకులు, విజయపురం : పన్నూరులో బ్యాడ్మింటన్ పోటీల్లో క్రీడాకారులు



విజయపురం: బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీడీవో చంద్రమౌళి,



పాలసముద్రం: మండల స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన వారితో ఎంపీడీవో రామనాథరెడ్డి



పాలసముద్రం: క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ





కార్వేటినగరం : వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు, పెనుమూరులో పోటీలను ప్రారంభిస్తున్న మనోహర్, వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

ఇరుగు పొరుగు

వైద్యులు సేవా దృక్పథంతో పనిచేయాలి



రికార్డులను పరిశీలిస్తున్న డీఐఓ రవిరాజు

చిత్తూరు రూరల్: వైద్యులు సేవా దృక్పథంతో పనిచేయాలని డీఐఓ రవిరాజు అన్నారు. చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గురువారం కొత్తగా విధుల్లో చేరిన వైద్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని పిలుపునిచ్చారు. పల్లెటూళ్ల ప్రజలకు అందుబాటులో ఉండాలని, విధుల్లో అలసత్వం వహించరాదని, తమ వైద్యసేవలతో పీహెచ్‌సీ ఓపీల సంఖ్యను పెంచాలని సూచించారు.

అర్బన్ హెల్త్ సెంటర్ తనిఖీ

చిత్తూరు నగరంలోని మాపాక్షి అర్బన్ హెల్త్ సెంటర్‌ను గురువారం డీఐఓ రవిరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్ర నిర్వహణ రికార్డులను పరిశీలించారు. ఓపీ వివరాలపై ఆరా తీశారు. వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహించరాదని సిబ్బందికి హితవు పలికారు. సమపాలన పాటించడంతో పాటు ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. గర్భిణీలకు ప్రభుత్వం అందించే సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన ఆదేశించారు.

జలజీవన్ మిషన్‌తో ఇంటింటికీ తాగునీరు



సమావేశంలో మాట్లాడుతున్న ఏఈ హేమంత్

గుడిపాల: జలజీవన్ మిషన్ పథకంతో గ్రామాల్లో తాగునీటి సమస్యను తీర్చడమే ప్రభుత్వ లక్ష్యమని ఆర్‌డబ్ల్యూఎస్ అసిస్టెంట్ ఇంజినీర్ హేమంత్ కుమార్ అన్నారు. గురువారం వసంతాపురం సచివాలయంలో పశుమంద, వసంతాపురం గ్రామస్తులకు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికీ మంచినీటి కొళాయి ఏర్పాటు చేయడమే జలజీవన్ మిషన్ ముఖ్య ఉద్దేశమన్నారు. దీంతో పాటు ప్రభుత్వ భవనాలకు కూడా నీటి సౌకర్యం కల్పించినట్టు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ రజనీకాంత్, పంచాయతీ కార్యదర్శి పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

చిత్తూరు అర్బన్: ఎస్ఈబీ అధికారులు గురువారం బంగారుపాళ్యం మండలంలో కర్ణాటక మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని ఓ వ్యక్తిని అరెస్ట్ చేశారు. సీఐ చంద్రశేఖర్ ఆదేశాల మేరకు అధికారులు, సిబ్బంది బంగారుపాళ్య మండలం పాలేరు బ్రిడ్జి వద్ద వాహనాలు తనిఖీ చేశారు. మొగిలి వెంకటగిరికి చెందిన రాజేష్ (37)ను అరెస్టు చేసి అక్రమంగా తరలిస్తున్న 768 కర్ణాటక మద్యం బాటిళ్లను సీజ్ చేశారు. ప్రాథమిక విచారణలో బంగారుపాళ్యంకు చెందిన అంజాద్ ఖాన్ (37) అనే వ్యక్తి మద్యం సరఫరా చేస్తున్నట్లు తేలింది. దీంతో అతడిపై కూడా కేసు నమోదు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. తనిఖీలో ట్రైనీ ఏఈఎస్ శ్రీరాం, ఎస్ఐ మోహన్‌బాబు, సిబ్బంది క్రిష్ణయ్య, సుబ్రమణ్యం గౌడు, కిరణ్‌కుమార్, వెంకటేష్, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ



నాగలాపురం: అండర్-14 త్రోబాల్ రాష్ట్ర పోటీల్లో మండల పరిధిలోని కారణి హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. నంద్యాలలో జరిగిన ఈ పోటీల్లో కావ్య, విజయలక్ష్మి, శివాణి ప్రతిభ చాటి రజత పతకాన్ని కైవసం చేసుకున్నారు. విద్యార్థులను హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

గణితంపై ఆసక్తిని పెంచాలి



సత్యవేడు: మాట్లాడుతున్న ఎంఈఓ రవి

సత్యవేడు: విద్యార్థులకు గణితంపై ఆసక్తి కలిగేలా బోధన సాగాలని ఎంఈఓ కె.రవి తెలిపారు. గురువారం బాలుర ఉన్నత పాఠశాలలో వరదయ్యపాళెం, బుచ్చినాయుడుకండ్రిగ, సత్యవేడు మండలాల గణిత ఉపాధ్యాయులకు సీఆర్‌సీ సమావేశం జరిగింది. ఎంఈఓ సీఆర్‌సీ సమావేశాన్ని తనిఖీ చేశారు. విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాల పెంపొందించాలని సూచించారు. గ్రూప్ యాక్టివిటీ, రోల్‌ప్లే, టీఎల్ఎం తయారీ, కేస్ స్టడీస్‌పై ఉపాధ్యాయులు అవగాహన పొంది విద్యార్థులకు సులభతరంగా అర్థమయ్యేలా బోధించాలన్నారు.

కొండచుట్టు మండపం పనుల పరిశీలన



కొండచుట్టు మండపం పనులను పరిశీలిస్తున్న మంత్రి రోజా

- రోజా చారిటబుల్ ట్రస్ట్ నిధులు రూ.10 లక్షలతో నిర్మాణం
- పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా

పుత్తూరు: సంక్రాంతి పండుగ సందర్భంగా కొండ చుట్టుకు వచ్చే భక్తుల సౌకర్యార్థం పుత్తూరులో రోజా చారిటబుల్ ట్రస్ట్ నిధులు రూ.10 లక్షలతో మండపాన్ని నిర్మిస్తున్నట్టు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన, క్రీడా శాఖల మంత్రి ఆర్కే రోజా తెలిపారు. ఆమె గురువారం మండపం నిర్మాణ పనులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ తెలుగు ప్రజల అతిపెద్ద పండుగ సంక్రాంతి చివరి రోజున నిర్వహించే గిరి ప్రదక్షిణకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. పుత్తూరులో రోడ్డు విస్తరణ పనుల్లో తొలగించిన కొండచుట్టు మండపాన్ని తాను ఏర్పాటు చేసే అవకాశం కలిగినందుకు సంతోషంగా ఉందన్నారు. అనంతరం 23వ వార్డులోని లక్ష్మీనగర్ కాలనీలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.8 లక్షలతో నిర్మిస్తున్న మురుగు కాలువ పనులను పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎ.హరి, ఎంఎల్‌వో దిలీప్, కౌన్సిలర్ చిట్టిబాబు, ఆలయ కమిటి చైర్మన్ రమేష్‌బాబు పాల్గొన్నారు.



మురుగు కాలువ పనులను పరిశీలిస్తున్న మంత్రి

రూ.35 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణం

వెదురుకుప్పం: మండలంలోని నల్లవెంగనపల్లె దళితవాడలో రూ.35 లక్షలతో కమ్యూనిటీ హాల్‌ను నిర్మించనున్నట్టు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి తెలిపారు. ఆయన గురువారం గ్రామ సమీపంలో స్థలాన్ని పరిశీలించారు. నల్లవెంగనపల్లెకు కమ్యూనిటీ భవన నిర్మాణం కోసం తుడా నిధులు రూ.35 లక్షలు మంజూరయ్యాయి. ప్రభుత్వ భూమి అందుబాటులో లేకపోవడంతో నిర్మాణ పనులు చేపట్టలేదు. గ్రామానికి చెందిన రిటైర్డ్ ఎంఈవో కావలి చెంగయ్య భూమి ఇవ్వడానికి ముందుకొచ్చారు. తన సొంత భూమిలో కమ్యూనిటీ భవన నిర్మాణం కోసం 9 సెంట్లు ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేశారు. ఆ స్థలంలో భవన నిర్మాణం చేపట్టనున్నట్లు కాంట్రాక్టర్ పద్మనాభ రెడ్డి చెప్పారు. మానవతా దృక్పథంతో గ్రామస్తుల కోసం భూమిని ఇస్తున్న చెంగయ్యను అభినందించారు. త్వరలో పనులను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యుడు వెంకటేశ్, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు రామయ్య, వైఎస్సార్ సీపీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు శివాజీ, బొమ్మయ్యపల్లె సర్పంచ్ గోవిందయ్య, సచివాలయ కన్వీనర్ వెంకటేశ్ పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

నగరి : మండలంలోని అడవికొత్తూరు ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థులకు గురువారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఎంపీపీ భార్గవి, ఎంఈవో శ్రీదేవి 21 మంది విద్యార్థులకు ఒక్కొక్కటి రూ.33 వేల విలువైన ట్యాబ్‌లను అందజేశారు. ఎంపీపీ మాట్లాడుతూ నాడు-నేడు పథకంలో పాఠశాలలను ఆధునికీకరించినట్టు తెలిపారు. ప్రస్తుతం విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేస్తున్నామన్నారు. డిజిటల్ బోర్డులు, ఆంగ్ల మాధ్యమం, బైలింగ్యువల్ పుస్తకాలు, ట్యాబ్‌లు తదితరాలతో పాఠశాలలను కార్పొరేట్ స్థాయికి అభివృద్ధి చేసినట్టు పేర్కొన్నారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి చేస్తున్న కృషిని తల్లిదండ్రులు గుర్తించాలన్నారు. కార్యక్రమంలో భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ట్యాబ్‌లతో విద్యార్థులు, ఎంపీపీ, ఎంఈవో

వైభవంగా గొబ్బి దేవత ఉత్సవం




ప్రత్యేక అలంకారంలో గురుదక్షిణామూర్తి, ఊరేగుతున్న గొబ్బెమ్మ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం ధనుర్మాసాన్ని పురస్కరించుకుని గొబ్బిదేవత ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ అలంకార మండపంలో అమ్మవారికి పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. తదుపరి మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్ఛారణల నడుమ పురవీధి ఉత్సవం జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూర నీరాజనాలు సమర్పించారు.

ఆగమోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు

శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం గురుదక్షిణామూర్తికి ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, సభ్యులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

అమరలో అరుదైన శస్త్రచికిత్స

రేణిగుంట: మండలంలోని కరకంబాడి సమీపంలోని అమర ఆస్పత్రిలో ఓ వృద్ధుడికి గుండె సంబంధిత అరుదైన ఆపరేషన్ విజయవంతంగా చేసినట్లు ఆస్పత్రి కార్డియాలజీ వైద్య నిపుణులు డాక్టర్ శివకృష్ణ తెలిపారు. మదనపల్లెకు చెందిన వెంకటరమణ(81) కొన్ని నెలల నుంచి గుండె వాపు సమస్యతో అనేక ఆస్పత్రుల్లో చూపించుకున్నా నయం కాకపోవడంతో అమరలో చేరాడు. డాక్టర్ శివకృష్ణ వైద్య పరీక్షలు చేసి, ఆయనకు శస్త్ర చికిత్స చేసి సీఆర్‌టీ పరికరం అమర్చారు. దీంతో ఈఎఫ్ పర్సెంటేజ్ మెరుగుపడడంతో ఆయనను డిశ్చార్జ్ చేశారు. వారి కటుంబ సభ్యులు అమర ఆస్పత్రి యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు.



శస్త్రచికిత్స విజయవంతం చేసిన డాక్టర్ శివకృష్ణ

15 మంది బైండోవర్

బుచ్చినాయుడుకండ్రిగ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వీఎస్‌పురం, కారణిమిట్ట గ్రామాలకు చెందిన 15 మందిని గురువారం తహసీల్దారు భార్గవి ఎదుట పోలీసులు హాజరు పర్చా రు. ఆమె మాట్లాడుతూ ఎన్నికలప్పుడు గొడవలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

స్కూటరిస్ట్‌కు గాయాలు

ఏర్పేడు: మండలంలోని మేర్లపాక వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో స్కూటరిస్ట్ గాయపడ్డాడు. ఏర్పేడు సీఐ శ్రీహరి అందించిన వివరాలు.. శ్రీకాళహస్తికి చెందిన సుబ్రమణ్యం(36) ద్విచక్ర వాహనంపై తిరుపతికి వెళుతున్నాడు. మేర్లపాక వద్ద ముందు వెళుతున్న లారీని అధికమించబోయి అదుపు తప్పడంతో ప్రమాదం జరిగింది. క్షతగాత్రుడిని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్ర సందర్శన



చిత్తూరు రూరల్: మండలంలోని ఒంటిళ్ల అనంతాపురంలో గురువారం మండల మహిళా సమాఖ్య అధికారులు ప్రకృతి వ్యవసాయ క్షేత్ర సందర్శన చేశారు. సేంద్రియ పద్ధతిలో లోకేష్ సాగు చేస్తున్న పంటలను ఏపీఎం విజయభాస్కర్, డీఆర్‌డీఏలోని ఎఫ్‌పీఓ సూరి పరిశీలించారు. సేంద్రియ వ్యవసాయం వల్ల కలిగే లాభాలు, దిగుబడి, పెట్టుబడి తదితర వివరాలను రైతును అడిగి తెలుసుకున్నారు. జీవామృతం తయారీ గురించి రైతు అధికారులకు వివరించారు. నాంచారమ్మ, గురుప్రసాద్, నీలకంఠ, షర్మిల, సుబ్రమణ్యం పాల్గొన్నారు.